
# ఎన్‌లైటెన్‌మెంట్ అంటే?

-బ్రహ్మర్షి పత్రీజీ



# ఎన్‌లైటెన్‌మెంట్ అంటే?

'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే, 'ఒక దివ్య జీవన విధానం" అని చెప్పకోవచ్చు!

'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే, 'పరిణితి చెందిన మానవ జీవన విధానం' అని చెప్పకోవచ్చు!

'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే,'ఒక సభ్యసామాజికుడి జీవనరీతి' అని చెప్పకోవచ్చు!

'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే, 'ఒక విస్తృతమైన మనోదృక్పథాలున్న మనిషి వ్యవహార తీరు" గా వ్యవహరించవచ్చు!

కనుక, ఈ రోజు ఈ యొక్క 'ఎన్‌లైటెన్‌మెంట్ స్టేట్' అంటే "సరి అయిన పరిణితి చెందిన మానవ వ్యవహార శైలి" గురించి విస్తృతంగా తెలుసుకుందాం.

ప్రపంచంలో సగటు మానవుడు 'పుడ్తాడు', 'పెరుగుతాడు'; 'తింటాడు', 'నిద్రపోతాడు'; 'చస్తాడు'! అంతేకానీ తన జీవితాన్ని తాను విశేషంగా విశ్లేషించ ప్రయత్నించడు. "ఏదో ఒక సామాజికుడు"గా, "ఏదో ఒక సంఘ సభ్యుడు"గానో వుంటాడే కానీ, ఒక విలక్షణమైన సభ్య సామాజికుడుగా ఉండ నిర్ధారించుకోడు. కానీ ఒక ఎదిగిన మానవుడు. ఒక పరిణితి చెందిన మానవుడు "నేను ఏ విధంగా జీవించాలి?" "ఏ విధమైన జీవన సరళి సరి అయినది?" - అని తెలుసుకోవడానికి ఉబలాటపడతాడు, అందువలన ఆ పద్ధతి తెలుసుకుని ఆ విధంగా జీవిస్తాడు - ఆ వ్యక్తికి 'ఎన్‌లైటెన్‌మెంట్ ఉంది" అని మనం చెప్పకుంటాం.

ఈ 'ఎన్‌లైటెన్‌మెంట్' పదంలో 'లైట్' అనే పదం ముఖ్యమైనపదం. 'లైట్ ' అంటే 'ప్రకాశం'. దానికి విరుద్ధమైన పదం'చీకటి' మానవుల జీవితాల్లో కొన్ని చీకటైన బ్రతుకులుంటాయి. కొన్ని ప్రకాశవంతమైన బ్రతుకు లుంటాయి. చీకటి బ్రతుకులు బ్రతికేవాళ్ళు అంటే 'ఎన్‌లైటెన్‌మెంట్' లేని వాళ్ళు; ప్రకాశవంతమైన బ్రతుకులు బ్రతికేవాళ్ళు అంటే చక్కటి 'ఎన్‌లైటెన్ మెంట్' వున్నవాళ్ళు. చీకటి బ్రతుకు యొక్క లక్షణాలు ఎన్నో! అలాగే ప్రకాశవంతమైన బ్రతుకు యొక్క లక్షణాలు అన్ని!

ఈ రోజు మనం చీకటి బ్రతుకుల రకరకాల లక్షణాలనూ, తత్సంబంధిత ప్రకాశవంతమైన బ్రతుకుల లక్షణాలనూ, సుగుణాలనూ, రీతులనూ విపులంగా తెలుసుకుందాం.

ఉదాహరణకు, "నాకే అన్నీ తెలుసు" అని బ్రతికేవాడు ఓ చీకటి బ్రతుకు బ్రతికేవాడు. తత్ విరుద్ధంగా "నాకు కొంత తెలిసి వుండవచ్చు; కొంత తెలిసి వుండకపోవచ్చు" అన్న చక్కటి అవగాహనతో జీవించేవాడు ప్రకాశవంతమైన బ్రతుకు బ్రతికేవాడు, ప్రకాశంలో వుండేవాడు, అతను 'ఎన్‌లైటెన్డ్'!

కనుక "నాకే తెలుసు" అనుకున్నవాడు చీకటి మనిషి అయితే "నాకు తెలుసు, ప్రక్కవాడికీ తెలిసి ఉండవచ్చు" అని గ్రహించినవాడు వెలుతురు బ్రతుకు బ్రతుకుతున్న వాడు, కనుక, "తన అజ్ఞానాన్ని తాను తెలుసుకున్నవాడు ఒక 'ఎన్‌లైటెన్‌మెంట్ మాస్టర్'; తన అజ్ఞానాన్ని తాను తెలుసుకోలేని వాడు 'ఎన్‌లైటెన్‌మెంట్ లేనివాడు' అని మనం చెప్పకోవచ్చు.

ఇకపోతే, "తెలుసుకోవడానికి ఒక 'అంతు' లేదు, ఒక 'చివర' లేదు, 'లిమిట్' లేదు" అని తెలుసుకున్న వాడే 'ఎన్‌లైటెన్‌మెంట్' వున్నవాడు.

తెలుసుకోవడానికి ఏదో ఒక పరిధిని పెట్టుకున్నవాడు 'ఎన్‌లైటెన్ మెంట్ లేనివాడు'. తెలుసుకోవడానికి ఒకానొక పరిధిని పెట్టుకుని 'అది ఇంక తిరుగులేని స్థితి' అని ముందుగానే నిర్ధారించుకునేవాడు 'ఎన్‌లైటెన్ మెంట్' లేనివాడు. ఉదాహరణకు తెలిసినా తెలియకపోయినా "చివరికి జీవాత్మ పరమాత్మలోనే ఐక్యమైపోతుంది' అని చాలామంది ముందుగానే నిర్ధారించుకుంటారు -అదేదో తమకు ఖచ్చితంగా తెలిసినట్లు!

తెలియనప్పడు 'ఇది నాకు తెలియదు, ఈ విధంగా విన్నాను" అని మాత్రమే ప్రస్తావించడం ఎన్‌లైటెన్డ్ స్థితి. "నేను అలా విన్నాను" అని చెప్పకోకుండా "అది అంతే! అది అలానే వుంటుంది!" అని ఆ విధంగా హేతురహితంగా నమ్మకం వుంచుకోవడం అనేది 'ఎన్‌లైటెన్‌మెంట్ లేకపోవడం' అన్నమాట.

ఎంత తెలుసో అంతే మాట్లాడినప్పడు మనకు 'ఎన్‌లైటెన్‌మెంట్' వుందన్నమాట! ఏ మాత్రం, రవ్వంతైనా, మనకు తెలియనిది తెల్సినట్లు మాట్లాడితే అది 'ఎన్‌లైటెన్‌మెంట్ లేనట్టన్నమాట'.

కనుక, ఈ 'ఎన్‌లైటెన్‌మెంట్' అనేది రకరకాల రీతిలలో

ప్రత్యక్షమవుతుంది. ఈ 'ఎన్‌లైటెన్‌మెంట్' అన్న దాని యొక్క పూర్ణస్వరూపం తెలుసుకోవడమే ఈ రోజు మనం చేసే కృషి.

"నేను ఈ శరీరమే, ఈ పుట్టుక - చావు మధ్య వున్నవాడినే" అని అనుకుంటే అది మళ్ళీ చీకటి బ్రతుకు! " 'ఈ సృష్టి అంతా నేనే', 'నేనే ఆ సృష్టి అంతా' " అని తెలుసుకున్న పరిపూర్ణస్థితే ఎన్‌లైటెన్‌మెంట్ స్థితి.

ఇలాంటి పరిపూర్ణ 'ఎన్‌లైటెన్‌మెంట్' స్థితికి రావడమంటే అది మామూలు సంగతేమీ కాదు! అది ఒక అద్భుతమైన ప్రక్రియ! అది ఒక హిమాలయ పర్వతశ్రేణుల్లోని ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడానికి చేసే ప్రయత్నం లాంటిదన్నమాట! "నేనే అంతా", "అంతా నేనే" అని గ్రహించగల స్థితికి ఎదగగలగడమనేది ఒక అత్యద్భుతమైన 'ఎన్‌లైటెన్‌మెంట్' ప్రక్రియ. మొత్తం మీద ఇదొక్కటే సత్యం కనుక ఈ సత్యానికి తక్కువ పాళ్ళలో వున్న ఏ విధమైన ఇతర అవగాహన 'ఎన్‌లైటెన్‌మెంట్' అనిపించుకోదు!

'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే ప్రతి ప్రాణి పట్ల చక్కటి మైత్రీభావం వుండటం! "సర్వ ప్రాణికోటి పట్లా సహృదయతా భావం కలిగి వుండటమే 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే, - ఏ ఒక్క ప్రాణి పట్ల ఏహ్యభావం వుంటే అది 'ఎన్‌లైటెన్‌మెంట్' అనిపించుకోదు!

ఏ ప్రాణి యొక్క జీవన రీతులు దానివి! ఏ ప్రాణి యొక్క ఇష్టా ఇష్టాలు దానివి! ఏ ప్రాణి యొక్క ధర్మాధర్మాలు దానివి! ప్రతి ప్రాణీ కూడా సర్వ స్వతంత్రమైనది. మనకు ఏం హక్కు వుంది - "అది ఆ విధంగా వుండాలి; ఈ విధంగా వుండాలి" అని నిర్ధేశించడానికీ? కనుక, ప్రతి ప్రాణి యొక్క స్వాతంత్ర్యతను దానికి ఇచ్చి, ఆ యొక్క స్వాతంత్ర్యత పట్ల సహృదయతనూ, మైత్రీభావాన్నీ కలిగి వుండటమే 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే.

అంతే కానీ, "భారతదేశ వాసుల పట్లనే సహృదయత; పాకీస్తానీయులు సహృదయతకు పనికి రారు, వారు అంతా దుర్జనులు" అనుకోవడం ఏ మాత్రం 'ఎన్‌లైటెన్‌మెంట్' కాదు.

"నేను బ్రాహ్మణుడిని ఉచ్ఛస్థితిలో వున్నవాణ్ణి. మిగతా వాళ్లంతా వేరే వాళ్ళు నీచమైన వాళ్ళు; నా యొక్క సహృదయ భావానికి తగరు" - అని విశ్వసించడం, ఆ విధంగా బ్రతకడమనేది ఎంతటి చీకటి బ్రతుకో!

ప్రతి ప్రాణి పట్లా కరుణ కలిగి వుండడమే 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే! మన సహృదయతా భావం అనేది మన భౌతిక రూపంలో ఎప్పుడైతే మన

భౌతిక చర్యల ద్వారా ప్రకటితమౌతుందో దానినే 'కరుణ' అంటాం. ఎంతోమంది మానవులు మనకన్నా తక్కువ పరిణితి చెందిన స్థితుల్లో వుంటారు. వారి 'విపరీత ప్రవర్తన' అన్నది వారి వారి తక్కువ ఆత్మస్థాయి ప్రకారమే వుందని తెలుసుకుని వారికి తగిన చేయూతనివ్వడం - అదే 'కరుణ' అంటే! ఎప్పుడైతే మన క్రింది వారి పట్ల కరుణామయులుగా మనం వుంటామో మనకన్నా ఉచ్ఛస్థితిలో వున్న, ఎక్కువ 'ఎన్‌లైటెన్డ్ స్థితిలో వున్న వారు, మాస్టర్లు - వాళ్ళు - మనపట్ల వారి కరుణా వీక్షణాలను వీక్షిస్తారు. అప్పుడు మనకు వారి వల్ల సహాయం అందుతుంది. కనుక 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే ఎలాంటి పరిస్థితుల్లో కూడానూ కరుణను వీడకుండా వుండడం- అంటే 'కరుణామయుడు' గా వుండడమే ఎన్‌లైటెన్డ్ మాస్టర్ అంటే!

"నీ చావు నువ్వు చావు! నాకేం పట్టింది నీ సంగతి!- నన్ను ముట్టు కోకు నామాల కాకి" అని వేరుగా వుండప్రయత్నించేవాణ్ణి, సహజంగా తాను చేయగల సాయాన్ని చేయ నిరాకరించిన వాణ్ణి 'ఎన్‌లైటెన్డ్ మాస్టర్' అని అనం.

మన దగ్గర ఏది వుందో అది విచ్చలవిడిగా మనకన్నా తక్కువ స్థాయిల్లో వుండే వారికి ఇస్తూ వారికి నిరంతరం చేయూతగా వుండడమే 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే.

"నీ కర్మకు నువ్వే భాధ్యుడవు; కనుక, నీ సంగతి నువ్వే చూసుకో" అని ఇతర ప్రాణికోటిని - తనకన్నా తక్కువగా ఎదిగిన ప్రాణికోటిని - గాలికి వదిలివేసే వారిని ఎన్‌లైటెన్డ్ అనం.

కనుక, ఎవరైతే నిరంతరం కరుణామయులో వారే ఎన్‌లైటెన్డ్ మాస్టర్లు. కరుణలేనివాళ్ళు 'ఎన్‌లైటెన్‌మెంట్' లేనివారు.

'ఎన్‌లైటెన్‌మెంట్' ఉన్నవారు అంటే "తప్పులు చేయని వాళ్ళు" అని కాదు! "తమ తప్పులను తెలుసుకున్న వాళ్ళు" అని అర్ధం!

ప్రతి జీవీ కూడా తన ప్రగతి పధంలో నిశ్చయంగా తప్పులు చేయవలసిందే! క్రొత్త పాఠాలు నేర్చుకునేటప్పుడు తప్పటడుగులు తప్పవు కదా! అలాంటి తప్పటడుగులు 'పాపాలు' కావు! అవి 'తప్పులు' కావు! 'క్షమించ రాని నేరాలు" కావు!

తమ తప్పనిసరి తప్పటడుగులను తామే క్షమించరాని నేరాలుగా

పరిగణిస్తే అలాంటి వాళ్ళకి 'ఎన్‌లైటెన్‌మెంట్' లేదన్నమాట! అలాగే ఇతరుల తప్పనిసరి తప్పటడుగులను క్షమించరాని నేరాలుగా పరిగణిస్తే వాళ్ళకి 'ఎన్‌లైటెన్‌మెంట్' లేదన్నమాట.

కనుక, నేర్చుకునే వారి తప్పటడుగులను 'తప్పటడుగులు' గానే స్వీకరించి వారి తప్పటడుగులను 'తప్పులు' గా చూడకుండా "అవి వారు వారి వారి విద్యాభ్యాసాల్లో నేర్చుకోవడానికి చేసే చిన్ని చిన్ని లోపభూయిష్టమైన ప్రయత్నాలే" అని వాటిని గుర్తిస్తూ ఆ విధంగా, ఆ అవగాహనలో వుండడమే 'ఎన్‌లైటెన్డ్' అంటే! అంతేకానీ, ఆయా విద్యలు నేర్చుకునేటప్పుడు వారు అపస్వరాలు పలికితే వెంటనే వారి మీద పడి చీల్చి చెండాడి వాళ్ళ గొంతు పిసికి "నువ్వు అపస్వరాలు పలికావు, నువ్వు పనికి మాలిన వాడివి" అని నేరస్థుడిగా నిర్ణయించడమనేది 'ఎన్‌లైటెన్‌మెంట్' లేని వాడి స్థితి.

ఒకవేళ నేరం చేసినా కూడానూ దానినే పదే పదే తలచు కూంటూండడం అనేది 'ఎన్‌లైటెన్డ్ స్థితి' కాదు. చేసిన నేరాన్ని అప్పటికప్పుడే మరచిపోవాలి. పదే పదే తలచుకుంటూంటే మళ్ళీ మళ్ళీ సమయం వృధా కదా! కనుక, మన తప్పులనూ మన పాపాలనూ ఏడ్చుకుంటూ పునశ్చరణం చేయడం కానీ ఇతరుల తప్పులనూ ఇతరుల పాపాలనూ పదే పదే ఎంచుతూ వుండడం కానీ - ఇదంతా ఎన్‌లైటెన్‌మెంట్ అని పించుకోదు!

తగని పాపాలు చేసినా వాటికి తగిన రీతిలో వ్యవహరించి, వాటిని వెంటనే మరచిపోయి నూతన సృజ నాత్మకమైన కార్యకలాపాల్లో క్రొత్తగా మునిగిపోవడమనేదే 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే. అంతేకానీ పదే పదే "నేను పాపిని; నేను పాపిని" అనుకుంటూ వుండడం కానీ, అదే విధంగా పదే పదే"నువ్వు పాపివి; నువ్వు పాపివి" అని ఆ జన్మాంతం ఇతరులను పీడిం చుకు తినడం అనేది కానీ ఏ మాత్రం 'ఎన్‌లైటెన్‌మెంట్' అనిపించుకోదు.

తప్పు చేసిన వాళ్ళ దగ్గర వాళ్ళు ఏ విధంగా తప్పులు చేశారో పరీ క్షించి ఆ తప్పులను మన జీవితాల్లో చేయకుండా నేర్చుకోగలగడమనేదే 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే! అలాగే, ఒప్పు చేసిన వాళ్ళను పరీక్షించి వాళ్ళు ఏ విధంగా ఒప్పుగా చేశారో తెలుసుకుని "ఆ విధంగా మనం కూడా ఒప్పుగా వుండగలగాలి" అని నిర్ణయించుకోవడమే - అదే 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే.

అంటే, ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టర్ అందరి దగ్గర నుంచీ నేర్చుకోగలడు - పాపాలు చేసిన వాళ్ళ దగ్గరి నుంచీ, పుణ్యాలు చేసేవాళ్ళ దగ్గరి నుంచీ!

పాపాలు చేస్తున్న వాళ్ళ దగ్గర నుంచి పాపాలు ఎలా చేయకూడదో తెలుసుకుంటాడు; పుణ్యకార్యక్రమాలు చేస్తున్న వాళ్ళ దగ్గర నుంచి ఏ విధంగా పుణ్య కార్యక్రమాలు చేపట్టాలో తెలుసుకుంటాడు.

ఈ విధంగా అందరి దగ్గరి నుంచీ అద్భుతమైన పాఠాలను నిర్విరామంగా, నేర్చుకుంటూ వుండేవాడే ఎన్‌లైటెన్డ్ మాస్టర్. ఎవ్వరి దగ్గరి నుంచీ ఏమీ నేర్చుకోనివాడు ఒక చీకటి బ్రతకు బ్రతికేవాడు - ప్రకాశం లేని వాడు, 'ఎన్‌లైటెన్‌మెంట్' లేనివాడు.

'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే ప్రొద్దున లేచినప్పటి నుంచీ రాత్రి పడకునే వరకూ 'వడ వడా వాగడం' కాదు! చక్కగా చక్కటి మౌనస్థితిలో ప్రతి మనిషీ ప్రతిరోజూ ఎంతైనా గడపాలి. అలాంటి మౌనస్థితి అభ్యసిం చినప్పడు తప్ప ఎవ్వరూ 'ఎన్‌లైటెన్‌మెంట్' పొందలేరు! మాట్లాడుతూనే వుంటే, మాట్లాడడమే ధ్యేయంగా వుంటే ఎన్ని అపస్వరాలు దొర్లుతాయో చెప్పలేం! మౌనం అభ్యాసంతో వుంటే మనం పలుకుతున్నప్పడు, మనకు తెలియకుండానే మనలోంచి, మన మౌనం లోంచి ఎన్ని సుస్వరాలు వస్తాయో!

కనుక, 'మౌనం' అనేది మరొక చక్కని 'ప్రకాశంలో బ్రతికేవాడి' సుగుణం! మౌనం లేకపోవడమనేదే, నిరంతరంగా 'శబ్దం చేసే దుర్గుణం' ఉన్నవాడే ఒక చీకటి బ్రతుకు బ్రతికేవాడు - 'ఎన్‌లైటెన్‌మెంట్' లేనివాడు.

ముఖ్యంగా మరొక ఎన్‌లైటెన్డ్ మాస్టర్ వచ్చినప్పడు మనం నోరు మూసుకుని అతని దగ్గర కూర్చోవడమే ఎన్‌లైటెన్‌మెంట్ అంటే! మనకంటే తక్కువ జ్ఞాన పరిస్థితులలో వున్న వాళ్ళ దగ్గర మనం నోరు విప్పవచ్చునేమో గానీ మనకన్నా ఎక్కువ జ్ఞాన పరిస్థితులలో వున్న వాళ్ళ దగ్గర మనం నోరు విప్పడమనేది ఎంతగా అసంగతమైనదో!

మహా తత్వవేత్త రాధాక్రిష్ణన్ గారు రమణ మహర్షి దగ్గరకు వెళ్ళేవారు. ఆరు రోజులు వుండి మౌనంగా కూర్చుని వచ్చేవాడు. అఖం డమైన పండితుడు రాధాక్రిష్ణన్ కానీ, 'అంతకన్నా ఉచ్ఛస్థితి'లో వెలుగుతున్న మాస్టర్ రమణ మహర్షి! ఆయన దగ్గర తనకు మాట్లాడటానికి ఏమీ లేదని తెలుసు ఈయనకి! కనుక చక్కగా నిశ్శబ్దంలో వుండేవాడు.

కనుక, మనకన్నా ఆత్మజ్ఞానంగా 'ఎన్‌లైటెన్‌మెంట్' రీతిలో ఎక్కువ స్థాయిలో వున్నవారు దగ్గర వున్నప్పడు వారి ప్రక్కన పూర్ణమౌనంగా వుండి

వారిని గమనించడమే, వారిని వీక్షించడమే, వారి మాట తీరును పరీక్షించడమే 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే. అంతేకానీ అందరి దగ్గరా అంటే తెలిసిన వారి దగ్గరా, తెలియని వారి దగ్గరా ఒకటే రీతిలో ప్రవర్తించడ మనేది, 'మన మూస' లోనే మనం మాట్లాడడమనేది 'ఎన్‌లైటెన్‌మెంట్' అనిపించుకోదు.

'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే త్రికరణ శుద్ధి కలిగి వుండడం! మన మనస్సులో ఏది వుంటుందో దాన్నే మాట్లాడటం ఏది మాట్లాడుతున్నామో దాన్నే చేయడం; ఏం చేస్తున్నామో దాని గురించే మాట్లాడటం.

అంతేకానీ, మనస్సులో ఒకటి పెట్టుకుని వేరే విధంగా మాట్లాడటం అనేది ఎంత చీకటి బ్రతుకో! మాట్లాడేది ఒకటి చేసేది మరొకటి అన్నది ఎంత దుర్భరమైన పరిస్థితులకు దారి తీస్తుందో!

కనుక, 'త్రికరణ శుద్ధి' కలిగి వుండడమే 'ఎన్‌లైటెన్‌మెంట్'.

ఈ విధంగా 'ఎన్‌లైటెన్‌మెంట్' అంటే ఎన్ని రూపాలున్నాయో ఇంకా కొన్ని తెలుసుకుందాం.

"మన వాస్తవానికి మనమే సృష్టికర్తలం" అని తెలియని వాళ్ళు 'ఎన్‌లైటెన్‌మెంట్' లేని వాళ్ళు. చీకటి మనుషులు. "తమ వాస్తవానికి తామే సృష్టికర్తలు" అని తెలుసుకున్నవాళ్ళే ఎన్‌లైటెన్డ్ మాస్టర్లు.

మనం పుట్టేముందు మన పుట్టుకను మనమే ఎన్నుకుని వచ్చాం. మన లైఫ్ ఛాలెంజెస్‌నూ, మన యొక్క సమస్యలనూ, మన జీవిత సమస్యలను మనమే ఎన్నుకుని వచ్చాం. మన జీవిత వాస్తవాలకు మరెవ్వరూ కారకులు కారు. మన జీవిత వాస్తవాలకు మనమే కారకులం. మన స్వంత ఇచ్ఛతో మనం ఈ జన్మలోకి చేరాం. కనుక అలాగే పుట్టిన తరువాత కూడానూ అని తెలుసుకున్నవాళ్ళే ఎన్‌లైటెన్డ్ మాస్టర్లు.

మనం ఏ ఏ విధాలుగా ఎవరెవరితో వ్యవహరిస్తుంటామో ఆయా విధాలుగా వాళ్ళ దగ్గరి నుంచి ప్రతిఫలాలు పొందుతూంటాం. కనుక మన వాస్తవానికి, క్షణక్షణం, మనమే సృష్టికర్తలం. కనుక, "వాస్తవం ఇలా వుంది; అలా వుంది, అతను నన్ను పాడు చేశాడు. నా వాస్తవానికి అతను కారకుడు!" అని అన్యుల మీద నింద మోపడమనేది 'ఎన్‌లైటెన్‌మెంట్' లేని వారి స్థితి, తమ స్థితి గతులకు తామే కారకులం అని తెలుసుకుని ఎప్పటికప్పుడు నిందని గానీ, స్తుతిని గానీ తమ మీద తామే మోపుకునే

వారే ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్.

తమకు కలిగిన హానికి వేరొకడిని నిందించేవారు, తమకు కలిగిన లాభాలకి వేరొకరిని స్తుతించే వాళ్ళు ఎన్‌లైటెన్డ్ కానేకారు. ఎవరి కర్మలను వాళ్ళే అనుభవిస్తూంటారు! కనుక, "మనం అనుభవించే ఫలితాలు మన కర్మఫలితాలు" అనే ఒక్కగానొక్క అవగాహన కల్గివుండి ఆ విధంగా సదా వున్నవాళ్ళే ఎన్‌లైటెన్డ్‌మెంట్ మాస్టర్లు. అంతే కానీ ప్రతీదానికి కూడానూ ఇతరుల మీద నింద మోపుతూ వుండేవారు, ఎంత మాత్రం 'ఎన్‌లైటెన్ మెంట్' లేని వాళ్ళు.

ప్రపంచంలో తిరుగులాడుతున్నా కూడానూ ప్రపంచానికి అంట కుండా వుండేవాళ్ళే ఎన్‌లైటెన్డ్ మాస్టర్లు. "ప్రపంచంలో తిరుగుతున్నాం కదా" అని చెప్పేసి ప్రతిప్రాణితో కూడానూ అంటబడి వుండటం అన్నది ఎన్‌లైటెన్‌మెంట్ కాదు.

"తామరాకు మీద నీటి బొట్టు" లాగా ఎవరితో వున్నా కూడా, "వున్నాం' కానీ, 'అంటి వుండి లేదు" అన్న పరిస్థితి కలిగి వున్నవాళ్ళే ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్. బంధాలలో ఇరుక్కుని కనబడిన ప్రతి దానితో. వున్న ప్రతి దానితో విడదీయలేని ముడి కలిగి వుండడం అనేది వెలుగుకూ, దివ్యజ్ఞానానికీ, దివ్య ప్రకాశానికీ 'ఎన్‌లైటెన్‌మెంట్‌కూ' పూర్తి విరుద్ధం.

ఎందులో అయినా వుండవచ్చు . కానీ దేనితోనూ ముడిపడి వుండరాదు; ముడిపడిపోతే ఆ ముడి తీయడం చాలా కష్టం! సరిగ్గా ముడి తీయడం చేత కాకపోతే ఆ ముడి గట్టి పడిపోతుంది! అంతే కానీ ఆ ముడి విడివడదు.

ప్రతి దానితో 'ఓ అనుబంధం' కలిగి వుండాలి కానీ 'ముడిపడి' వుండవద్దు! ఆ ముడిపడి వుండడమే 'చీకటి బ్రతుకు' అంటే. దేనితోనూ ముడిపడి వుండకుండా వుండడమే 'వెలుతురు బ్రతుకు' అంటే.

ఏ పని చేయడానికైనా సందేహం కలిగి వుండేవారు. భయాందోళన కలిగి వుండేవాడు - అది చేస్తే ఏమౌతుందో అని వూగిసలాడే వాడు- ఎన్‌లైటెన్‌మెంట్ లేనివాడు. "చూద్దాం ఏమౌతుందో! దాని పర్యవసానం ఎలా వుంటుందో తెలియదు కదా! తెలియకుండా ఎందుకు నాకు భయం? ఎందుకు నాకు ఆందోళన? అక్కడికి పోయి చూద్దాం" అని ఏ మాత్రం భయం, ఆందోళనలు ఎట్టి పరిస్థితుల్లోనూ లేని వాడే

ఎన్‌లైటెన్‌మెంట్ వున్నవాడు.

భయవిహ్వాలుడు అయినవాడు ఏ మాత్రం ఎన్‌లైటెన్‌మెంట్ లేని వాడు. ఎన్‌లైటెన్‌మెంట్ లేని వారి యొక్క ప్రధమ గుణం భయం కనుక చీకటిలో పోవాలంటే భయం, ఎందుకో తెలియదు! “ఎందుకు?” అంటే “నాకు తెలియదు” అంటాడు. అది ‘ఎన్‌లైటెన్‌మెంట్’ లేని వారి స్థితి.

కనుక హేతురహితమైన ఆందోళనలనూ, భయాలనూ పూర్తిగా వదిలి వేయటమే ఎన్‌లైటెన్‌మెంట్ అంటే. హేతుబద్ధమైన భయాలు తప్ప కుండా వుండి తీరాలి. ఉదాహరణకు, నిప్పులో చెయ్యిపెడితే చెయ్యి కాలుతుంది. కనుక నిప్పు నుండి దూరంగా వెళ్ళడం అనేది హేతుబద్దమైన భయం; అది జ్ఞానానికి సూచికే కాని అజ్ఞానానికి సూచిక కాదు. కనుక మనకు వుండే భయాలు, “హేతుబద్ధమైనవా”, “హేతురహితమైనవా”? తెలుసుకుని హేతురహితమైన భయాలకు సదా దూరంగా వుండడం అదే ఎన్‌లైటెన్డ్ స్థితి అంటే.

సరియైన, హేతుబద్దమైన భయాలకు లోబడి వుండి ఆ పరిస్థితులలో సరిగ్గా జీవించడమే ‘ఎన్‌లైటెన్‌మెంట్’ అంటే.

“మానవుడి శక్తి అపారమైనది” అని తెలుసుకోవడమే ‘ఎన్‌లైటెన్ మెంట్’ . అంటే “అసాధ్యమైనది లేనే లేదు” అన్న సత్యాన్ని గ్రహించడం! ‘నాకు ఇంతే సాధ్యం; నాకు ఇంతకన్నా సాధ్యం ఎలా అవుతుంది? నేను మానవమాత్రుణ్ణి కదా! నేను చదువులేని వాణ్ణి కదా!” అని తనను తాను కించపరచుకోవడం, తన శక్తిని తగ్గించుకోవడం అన్నది ‘ఎన్‌లైటెన్‌మెంట్’ కాదు.

ఎప్పటికప్పడు “ప్రతి వారి యొక్క శక్తి కూడా అనంతం” అని తెలుసుకుని ఆ యొక్క అవగాహనతోనే ప్రతి పనినీ చేపట్టడం అన్నదే ‘ఎన్‌లైటెన్‌మెంట్’కు సూచిక.

భావోద్రేకాలు కలిగినప్పడు ఆ భావోద్రేకాలను, సహజంగా గలిగిన భావోద్రేకాలను, త్రొక్కిపెట్టివేయడం అనేది ఎన్‌లైటెన్‌మెంట్ లేనిదానికి సూచన, చీకటి బ్రతుకుకు సూచన. “నాకు కోపం వస్తోంది! కానీ కోపం ప్రకటించకూడదు కదా! ఈ సమీజం ఒప్పకోదు కదా!” అని చెప్పేసి, దాని భావాలను త్రొక్కిపెట్టడం అనేది ‘ఎన్‌లైటెన్‌మెంట్’ అనిపించుకోదు. “నాకు కోపంగా వుంది; ఇది నా నిజస్వరూపం. ఇప్పడు దాన్నే నా

నిజస్వరూపాన్నే - నేను ప్రకటించాలి. సమాజం ఏమన్నా సరే! నేను లోపల ఇలా వున్నాను. ఈ విధంగానే నేను బయట వ్యవహరించాలి" అని భావోద్రేకాలను స్వేచ్ఛగా భయరహితంగా, నిర్భయంగా, సదా ప్రకటించగలిగి వుండడమే 'ఎన్‌లైటెన్‌మెంట్' కలిగి వుండడం అంటే.

అంతేకానీ "వాళ్ళు ఏమనుకుంటారో, వీళ్ళు ఏమనుకుంటారో" అని మనం ఎలాంటి భావాల్లో వున్నా వాటిని అణగద్రొక్కి వేరే భావాలను ముఖమ్మీద పూసుకోవడం అనేది ఏ మాత్రం జ్ఞానానికీ, వెలుగు బ్రతుకుకూ ప్రతీక కాజాలదు. 'ఎన్‌లైటెన్‌మెంట్' కాదు.

ఒక మనిషి వేరొక మనిషి క్రింద బానిస బ్రతుకు బ్రతకడం అనేది ఎన్‌లైటెన్‌మెంట్ కాజాలదు! ఎవ్వరికీ మనం తల వంచనవసరం లేదు. ఏ గడ్డి పువ్వూ ఏ తామర పువ్వుకూ తలవంచరాదు. ఎప్పుడూ తలవంచని ధీరులే 'ఎన్‌లైటెన్డ్' మాస్టర్స్! ఎప్పటికప్పుడు తల వంచుకుని అటూ ఇటూ తిరుగుతూ వుండేవారు - తాము తప్పు చేసి వుండరు కానీ, "నేను గడ్డి పువ్వును, అతను తామరపువ్వు కదా? అని తలవంచుకుని తిరిగేవారు ఏమీ చూడలేరు సత్యాన్ని గ్రహించలేరు - ప్రకృతిని దర్శించలేరు. తలవంచుకుంటే తమ నీడనే తాము చూస్తారు. తల వంచుకుంటే తమ నీడ తప్పితే ఇంక ఏం కనబడుతుంది?

అలాగే తలవంచుకుని తమ నీడనే తాము చూసేవారు - అలాంటివాళ్ళు - ఏ మాత్రం 'ఎన్‌లైటెన్‌మెంట్' లేనివారు. "సదా తలవంచని ధీరులే" 'ఎన్‌లైటెన్‌మెంట్' వున్నవాళ్ళు.

ఎప్పుడూ పకపకా నవ్వుతూ వుండేవాళ్ళే 'ఎన్‌లైటెన్‌మెంట్' వున్నవారు! అంతేకానీ, ఎప్పుడూ ఏడుస్తూ వుండేవారు. 'ఎన్‌లైటెన్‌మెంట్' వున్నవాళ్ళు కాజాలరు.

తమ మీద తాము నవ్వుకుంటూ, తమ మీద తాము జోకులేసుకునే వాళ్ళే 'ఎన్‌లైటెన్‌మెంట్ మాస్టర్స్'! కానీ ఎంతసేపూ ప్రక్కన వున్నవాళ్ళను హేళన చేస్తూ వాళ్ళ మీద జోకులు విసురుతూ, వాళ్ళను కించపరుస్తూ, ఆ విధంగా నవ్వుకునే వాళ్ళు ఎంతమాత్రం ఎన్‌లైటెన్డ్ కాదు. చీకటి బ్రతుకులు అవి.

"ఇంకొకరికి ఈ 'దివ్యజ్ఞాన ప్రకాశం' అనేది. 'ఎన్‌లైటెన్‌మెంట్' అనేది ప్రసాదించలేం" అని తెలుసుకున్న వాళ్ళే 'ఎన్‌లైటెన్‌మెంట్ మాస్టర్స్.

అది ఎవరికి వారు పొందవలసిందే! ఎవరిది వారి వారి కృషి ఫలితమే! కనుక, "ఒక 'ఎన్‌లైటెన్డ్ మాస్టరు' ఇంకొకరిని 'ఎన్‌లైటెన్డ్ చేయలేడని తెలుసుకోవడమే ఎన్‌లైటెన్‌మెంట్ అంటే! "నేను బుద్ధుణ్ణి అయ్యాను కనుక నేను నీకు బుద్ధత్వాన్ని ప్రసాదిస్తాను" అని అనుకుంటే నిజమైన 'బుద్ధత్వం' లేదన్నమాట. 'ఎన్‌లైటెన్‌మెంట్' లేదన్నమాట.

"సంసారం చీకటి, నిర్వాణమే వెలుతురు" - అని సంసారాన్ని దూరంగా వుంచేవాళ్ళు 'ఎన్‌లైటెన్‌మెంట్' లేనివాళ్ళు. "సంసారమే నిర్వాణం" అని తెలుసుకున్న వారే 'ఎన్‌లైటెన్‌మెంట్' వున్నవాళ్ళు.

"ఛీ భార్య', 'ఛీ పిల్లలు', 'ఛీ భర్త', 'ఛీ భౌతిక శరీరం'," అనేవాడు ఎన్‌లైటెన్డ్ కానేకాడు.

" 'భార్య అద్భుతం', 'పిల్లలు అద్భుతం', 'భర్త అద్భుతం', 'భౌతిక శరీరం అద్భుతం', 'సెక్స్ అద్భుతం', 'సంసారం అద్భుతం', 'ముసలి తల్లిదండ్రులు అద్భుతం', - 'అంతా అద్భుతమే' " అన్న అవగాహన సదా కలిగి వున్న వాడే 'ఎన్‌లైటెన్డ్ మాస్టర్'.

"యవ్వనంలో వుంటే మంచిది, లేకుంటే 'ఛీ', నా భార్య నాతో బాగా వుంటే సంసారసుఖం - ఏ మాత్రం భార్య వేరే అవగాహనలో వుంటే ఇంక సంసారమే దుఃఖం, ఈ సంసారాన్ని త్యజించాలి, నిర్వాణం వేరే చోట వుంది, సంసారాన్ని త్యజిస్తేనే నిర్వాణం వుంది" ఇలా అనుకున్నవాడు ఎప్పుడూ 'ఎన్‌లైటెన్‌మెంట్'ను పొందలేరు.

సంసారమే నిర్వాణం, సంసారంలో దుఃఖరాహిత్య స్థితిని వెతుక్కోగలిగిన వాడే 'ఎన్‌లైటెన్డ్ మాస్టర్.'

'సమయ వాసన' వున్నవాడు ఎన్‌లైటెన్డ్ కాదు, 'సమయవాసన' లేనివాడే ఎన్‌లైటెన్డ్.

నాకు ఇప్పుడు ఇన్ని సంవత్సరాలు; రేపు అన్ని సంవత్సరాలు వస్తాయి; ఇప్పుడు నలభై ఒకటి నా వయస్సు. పది సంవత్సరాల తరువాత యాభై ఒకటి వస్తుంది" అని ఎంతసేపూ ఇన్ని సంవత్సరాలు. ఇన్ని నెలలు, ఇన్ని రోజులు అవి వయస్సు లెక్క పెట్టుకునే వాడు ఏ మాత్రం ఎన్‌లైటెన్‌మెంట్ లేనివాడు. 'సమయవాసన' లేనివాడే ఎన్‌లైటెన్‌మెంట్ వున్నవాడు. తన జీవితాన్ని సంవత్సరాలలో, నెలలతో, రోజులతో, నిమిషాలతో కొలవని వాడే తన శాశ్వత స్థితిని సదా ఎరిగి వున్నవాడు. సమయరాహిత్య ఆలోచనా

పరిధిలో సదా వుండే వాడే ఎన్‌లైటెన్డ్ మాస్టర్.

జీసస్ క్రైస్ట్ చెప్పాడు "జడ్జ్ ఎ నాట్" అని. అంటే, "అవతలి వాళ్ళు అంతే, వాళ్ళు అదే అని తీర్మానించకు". నీకు తీర్మానించడానికి ఏ మాత్రమూ హక్కు లేదు! తీర్మానించటానికి తగినంత 'డేటా' అంటే తగినంత 'విషయగ్రహణ', లేదు నీకు. అలాగే మరెవ్వరూ కూడా నువ్వు ఇలాంటి వాడివి అని నిర్ణయించ హక్కు లేని వాళ్ళు - నిర్ణయించ ఆధారాలు లేనివాళ్ళు.

ప్రతి మనిషికీ కూడానూ తనకు తాను అవగాహన కావడమే అత్యంత దుర్లభం, అత్యంత కష్టం; అలాంటప్పుడు ఇంకొకళ్లను ఏ విధంగా అవగాహన చేసుకోగలడు? ఏ విధంగా జడ్జ్ చేయగలడు? కనుక, ఎవరినీ కూడానూ "వాళ్ళు అలాంటి వాళ్ళు, ఇలాంటి వాళ్ళు" అని తీర్మానించని వాళ్ళే ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్. అంతేకానీ "వాళ్ళు చెడ్డవాళ్ళు,వీళ్ళు మంచివాళ్ళు" అని స్వల్పమైన ఆధారాలతో, తీర్మానించే వాడు ఏ మాత్రం ఎన్‌లైటెన్‌మెంట్ లేనివాడు.

ఎప్పటికప్పుడు తక్షణ కర్తవ్యంలో నిమగ్నుడైన వాడే ఎన్‌లైటెన్డ్ మాస్టర్. రేపటి గురించి ఆలోచించేవాడు ఎప్పడు ఎన్‌లైటెన్డ్ కాదు. ఇప్పడు నేను ఏం చేస్తున్నాను? ఈ 'ఎన్‌లైటెన్‌మెంట్' అనే కథా వస్తువు గురించి మాట్లాడుతున్నాను దీని గురించి చక్కగా మాట్లాడడమే నా తక్షణ కర్తవ్యం! ఇక్కడ రికార్డ్ చేస్తున్నవారు వాళ్ళు పూర్తి శక్తినీ, మనస్సునూ బుద్ధినీ, ఆ 'రికార్డింగ్' మీద కేంద్రీకరించడమే వాళ్ళ తక్షణ కర్తవ్యం! వాళ్ళు దాని మీద కేంద్రీకరిస్తున్నప్పడే వాళ్ళు ఎన్‌లైటెన్డ్ ! కనుక, తక్షణ కర్తవ్యంలో ఎప్పటికప్పడు నిమగ్నం అవుతూ వుండడమే ఎన్‌లైటెన్‌మెంట్ అంటే! అంతేకానీ తక్షణ కర్తవ్యాన్ని విస్మరించి "రేపు నేను అది చేయాలి" అని దానికి తొందరపడి "దానికి ఏం చేయాలి?" అని ఇప్పడే ఆలోచిస్తూ కూర్చుని వుండేవాడు. ఏ మాత్రం జ్ఞానం లేనివాడు, ఏ మాత్రం వెలుగు లేనివాడు. రేపటి గురించి ఆలోచిస్తూ ఈ క్షణాన్ని సంపూర్ణంగా కోల్పోయేవాడు! ఎన్‌లైటెన్‌మెంట్ లేనివాడు.

ఎవరైతే "సర్వజ్ఞానానికీ ధ్యానమే ఆధారం! ధ్యానమే కారణం" అని తెలుసుకుంటారో వారికే ఎన్‌లైటెన్‌మెంట్ వుంది అన్నమాట. ధ్యానం గురించీ, మెడిటేషన్ గురించీ తెలియనివాడు ఎప్పడూ ఎన్‌లైటెన్డ్ కాడు.

“ధ్యానం శరణం గచ్ఛామి” అని తెలుసుకున్న వాడే ఎన్‌లైటెన్డ్. ‘ధ్యానం’ కాక వేరే శరణు కోరుకునేవాడు ఎప్పుడూ ఎన్‌లైటెన్డ్ కాజాలడు. ఎన్‌లైటెన్‌మెంట్ దరిదాపుల్లో కూడా వుండలేడు.

మన చుట్టూ అనేకానేక పరిస్థితులను మనం చూస్తూ ఏ పరిస్థితికైనా ‘ఆశ్చర్యపోవడం’ అనేది ఎన్‌లైటెన్‌మెంట్‌కు తార్కాణం కాదు. “అరే! ఎందుకు అలా జరిగింది?” అని ఆశ్చర్యపోవడం అనేది మన అజ్ఞానానికి ప్రతీక!

మన చుట్టూ ఏ పరిస్థితి జరిగినా “ఆ పరిస్థితి అలా ఆ విధంగా జరగడానికి ఏదో ఓ ప్రత్యేక కారణం తప్పకుండా వుండి తీరుతుంది” అని తెలుసుకుని ఆ కారణాన్ని వెదికి పట్టుకునే పరిశ్రమలో నిమగ్నమై వున్నవాడే ఎన్‌లైటెన్డ్ మాస్టర్. అంతేగానీ ప్రతిదానికి ఆశ్చర్యపోతూ వుండడం అనేది ఎన్‌లైటెన్‌మెంట్‌కు ప్రతీక కాదు.

ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టర్‌కి ఏ పరిస్థితీ ఆశ్చర్యకరమైనది కాదు. ఏ పరిస్థితీ కాకతాళీయం కాదు!

ఏ పని చేయడానికైనా తొందరపడి పని చేసేవాడు ఎన్‌లైటెన్ మెంట్ లేనివాడు. దేనికి తొందర? ఎక్కడికి పరిగెత్తిపోతుంది ప్రపంచం? కనుక, తొందరపడే వాడు ఎప్పుడూ ఎన్‌లైటెన్డ్ కాలేడు. “ఏ మాత్రం తొందరలేని వాడు’ అంటే ‘నిష్కర్ముడు’ కాడు! తొందరలేనివాడు ఎన్‌లైటెన్డ్ మాస్టర్.

సమయం వృథా చేసేవాడు ఎన్‌లైటెన్డ్ కాజాలడు. ప్రతిక్షణం కూడానూ చక్కటి కార్యకలాపాల్లో, చక్కటి సృజనాత్మకమైన విషయాలలో నిమగ్నమై వున్నవాడే ఎన్‌లైటెన్డ్. అంతేకానీ పనికిరాని కబుర్లతో “సమయాన్ని ఏ విధంగా గడపాలి? ఏ విధంగా చంపాలి?” అని ఆవిధంగా జీవితాన్ని వృథా పరచుకునే వాళ్ళు ఎన్‌లైటెన్డ్ కారు. ఒక ఎన్‌లైటెన్డ్ మాస్టరు ఒక్క క్షణం కూడా వృథా చేయడు. ప్రతిక్షణం కూడానూ చక్కగా పరిశ్రమిస్తూనో, చక్కగా నేర్చుకుంటూనో, ఏదేని కళను అభ్యసిస్తూనో, అభ్యసింపచేస్తూనో, లేకపోతే చక్కని విశ్రాంతి తీసుకుంటూనో లేకపోతే చక్కటి ఎంజాయ్‌మెంట్ లోనో, చక్కటి ఎంటర్‌టైన్‌మెంట్‌లోనో వుంటాడు అంతేకానీ పనికిరాని ఉబుసుపోని కబుర్లతో ఎప్పుడూ కూడా కాలాన్ని గడపడు!

ఎన్నో విద్యలు, ఎన్నో కళలు, ఎన్నో పనులు చేయవలసి వుండగా అమూల్యమైన సమయాన్ని పనికిరాని కబుర్లలో గడిపేవాడు ఎంత మూర్ఖుడో!

.. ఈ విధంగా, మనం ఎన్నో రకాలుగా, ఎన్‌లైటెన్‌మెంట్ గురించి ఈ రోజు చెప్పకున్నాం! 'ఆలోచిస్తూ' - పోతే ఇంకా ఎన్ని అయినా మనకు ఎన్‌లైటెన్‌మెంట్ యొక్క 'డెఫినెషన్స్' అంటే 'నిర్వచనాలు' దొరుకుతాయి.

ఎన్‌లైటెన్‌మెంట్ అంటేనే మనిషి యొక్క బ్రతుకు వెలుగు బ్రతుకు అవుతుంది! లేకపోతే అది చీకటి బ్రతుకే.

ఎప్పడూ కూడానూ శాస్త్రీయ దృక్పథం లేకపోతే ఎప్పటికీ ఎన్‌లైటెన్ మెంట్ కాజాలదు! శాస్త్రీయ దృక్పథం అన్న దాన్ని 'సైంటిఫిక్ మెథడ్' అంటాం. ప్రతిదాని పట్ల కూడానూ మనలో శాస్త్రీయ దృక్పథం వున్నవాడు, శాస్త్రీయ దృక్పథం ద్వారా తరచి, తరచి చూసినప్పడు, అందులోని మౌలిక సత్యాలు మనకు గ్రాహ్యమైనప్పడు అప్పడే మనకు ఎన్‌లైటెన్‌మెంట్ సిద్ధమౌతుంది. తరచి తరచి చూడనప్పడు, శాస్త్రీయ దృక్పథాన్ని, అవలంబించనప్పడు, అందులోని సత్యాలు మనకు గ్రాహ్యం కానప్పడు మన బ్రతుకులు చీకటి బ్రతుకులు! కనుక, ఒక ప్రక్క నిరంతర శాస్త్రీయ దృక్పథాన్ని అవలంబిస్తూ, ఇంకొక ప్రక్క నిరంతర ధ్యాన సాధన చేస్తూంటే - ఈ రెండు ప్రక్రియల ద్వారా - మనం అద్భుతమైన ఎన్‌లైటెన్‌మెంట్‌ను, దివ్య ప్రకాశాన్ని అను భవించవచ్చు.

మానవ జీవితంలో ఎంత ఎత్తుకు కావాలంటే అంత ఎత్తుకు ఎదగవచ్చు! ఎంత దిగజారిపోవాలంటే అంతగానూ దిగజారిపోవచ్చు!

ఒక ప్రక్క హిట్లర్ చూడండి- మరో ప్రక్క బుద్ధుణ్ణి చూడండి! తన బుద్ధిని వక్రీకరిస్తే, అశాస్త్రీయ దృక్పథాన్ని అవలంబిస్తే, ధ్యానం చెయ్యక పోతే మానవుడు 'హిట్లర్'గా మారతాడు. అదే మానవుడు శాస్త్రీయ దృక్పథాన్ని అవలంబిస్తే, సత్యాన్ని అనుసంధానం చేస్తే బుద్ధుడిగా వెలుగు తాడు. "బుద్ధుడిగా అవడమా? హిట్లర్‌గా అవడమా?" అన్నది మనకి మనం నిర్ణయించుకోవాలి.

కనుక, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ వారి ఏకైక ధ్యేయం మానవాళి సమస్తాన్ని ఎన్‌లైటెన్‌మెంట్ వైపుకు మరల్చడం! చిన్నప్పడే అందరినీ "ఎన్‌లైటెన్డ్ మాస్టర్స్" గా తయారు చేయడం! ఎప్పడో ముసలి

తనంలో కాదు ఇప్పుడే!

నాలుగేళ్ళ వయస్సులోనే ప్రహ్లాదుడు 'ఎన్‌లైటెన్డ్ మాస్టర్' అయ్యాడు. ఎనిమిది ఏళ్ళకే ధ్రువుడు 'ఎన్‌లైటెన్డ్ మాస్టర్' అయ్యాడు! పద్నాలుగేళ్ళకే వివేకానందుడు ఎన్‌లైటెన్‌మెంట్‌కోసం అర్రులు చాచాడు! ఏడవ క్లాసులో రమణ మహర్షి ఎన్‌లైటెన్‌మెంట్ కోసం సర్వస్వాన్నీ త్యజించాడు.

కనుక, ఎన్‌లైటెన్‌మెంట్ అనేది ఎవరు ఏ వయస్సులో ఎప్పుడు వింటారో అప్పుడే ఆ వయస్సులోనే చేపట్టవలసిన కార్యక్రమం. "నా ముక్కు ఇంకా పచ్చలార లేదు! ఇదంతా నాకు ఇప్పుడే అవసరం లేదు" అనే వాడు ఎంతయినా పోగొట్టుకుంటాడు.

"శుభస్య శీఘ్రం' అన్నారు. 'ఆలస్యం అమృతం విషం' అన్నారు. "కల్ కరేసో ఆజ్‌కరో, ఆజ్ కరేసో అబ్, పల్ మే ప్రళయ్‌హో, ఫిర్ కరోగే కబ్?".

కనుక, ఈ విషయాన్ని విన్న వెంటనే, ఈ యొక్క ఎన్‌లైటెన్‌మెంట్ యొక్క వివరాలన్నీ విన్న వెంటనే ప్రయత్నించాలి. అదే 'ఎన్‌లైటెన్‌మెంట్ అంటే!'

- బ్రహ్మర్షి పత్రీజీ

# ధ్యానం అంటే

ధ్యానం అంటే ప్రార్థన కాదు

ధ్యానం అంటే స్తోత్రం కాదు

ధ్యానం అంటే నామస్మరణ కాదు

ధ్యానం అంటే మంత్రజపం కాదు

ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస

# ధ్యానం వలన లాభాలు :

1) శారీరక ధారుఢ్యం

2) మానసిక ప్రశాంతి

3) బుద్ధి సునిశిత

4) ఆర్థిక సంక్షేమం

5) సుమిత్ర ప్రాప్తి

6) ఆధ్యాత్మిక విజ్ఞానం

# ముక్తి

ధ్యాన సాధన ద్వారానే దివ్యచక్షువు ఉత్తేజితమవుతుంది

ధ్యాన సాధన ద్వారా మనమే గురువులుగా మారుతాం

ధ్యాన సాధన ద్వారా మనమే దైవస్వరూపాలమని తెలుసుకుంటాం

*- బ్రహ్మర్షి పత్రీజీ*